# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలు సంకల్పానికి ప్రతీకలు అని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ❖ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక స్థిరత్వాన్ని పెంపొందించడానికి భారత్ - జపాన్ ల మధ్య భాగస్వామ్యం దోహదపడుతుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.
- ❖ పెన్షనర్ల జీవన ప్రమాణ పత్రం యాప్ ని మరింత సరళతరం చేశామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు,
- ❖ బీహార్‌లోని 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ రేపు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

మహిళలు సంకల్పానికి ప్రతీకలు అని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జరిగిన లఖ్‌పతి దీదీ సదస్సులో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల స్వావలంబనకు, సాధికారతకు ఈ సదస్సు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. అనేక సవాళ్లను అవకాశాలుగా మహిళలు మార్చుకుంటున్నారని ఉప రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక స్థిరత్వాన్ని పెంపొందించడానికి భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం దోహదపడుతుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 8వ ఇండియా-జపాన్ ఇండో-పసిఫిక్ ఫోరమ్‌లో కేంద్రమంత్రి ప్రసంగించారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఇటీవల కాలంలో మరింతగా పెరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారత్ - జపాన్ భాగస్వామ్యంతో కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, అంతరిక్ష రంగం తదితర అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల ఇరు దేశాలు కీలక బాధ్యతను కలిగి ఉన్నాయని విదేశాంగ మంత్రి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పెన్షనర్ల జీవన ప్రమాణ పత్రం యాప్ ని మరింత సరళతరం చేయడం ద్వారా వయో వృద్ధులకు ప్రయోజనం కలిగించామని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. డిజిటల్ ఇండియాతో అనుసంధానించబడిన జీవన ప్రమాణ యాప్ పెన్షనర్ల డిజిటల్ సాధికారతకు నిదర్శనం అని అన్నారు. నాలుగవ దేశవ్యాప్త డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచారాన్ని న్యూఢిల్లీలో ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటికే 25 లక్షలకు పైగా పెన్షనర్లు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను అందించడానికి, రూపొందించడానికి ముఖ ప్రామాణీకరణను స్వీకరించారని అన్నారు. ఈ సర్టిఫికెట్‌లను రూపొందించడానికి గతంలో బయోమెట్రిక్‌ను ఉపయోగించారని, కానీ 75 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెన్షనర్లకు ముఖ ప్రామాణీకరణను అందుబాటులోకి తీసుకుని వచ్చామని జితేంద్ర సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో 18 జిల్లాల పరిధిలో 121 నియోజకవర్గాల్లో శాసనసభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ రేపు జరగనుంది. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా సిమ్రీ, భక్తియార్‌పూర్, మహిషి, తారాపూర్, ముంగేర్, జమాల్‌పూర్, సూర్యగఢ అసెంబ్లీ స్థానాల్లోని 56 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటలకు కుదించారు. మొదటి దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని 3.75 కోట్లకు పైగా ఓటర్లు నిర్ణయించనున్నారు. మొదటి దశలో ఎన్డీయే కూటమి నుండి  జేడీయూ 57 స్థానాల్లో, బీజేపీ 48 స్థానాల్లో, ఎల్ జే పీ 14 స్థానాల్లో, రాష్ట్రీయ లోక్ మోర్చా 2 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. మహాఘట్ బంధన్ కూటమి నుండి ఆర్ జే డీ తరఫున 73 మంది అభ్యర్థులు, కాంగ్రెస్ నుండి 24 మంది, సీపీఐ ఎం ఎల్ నుండి 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర ప్రదేశ్ మీర్జాపూర్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం ఈరోజు జరిగింది. చునార్ రైల్వే స్టేషన్‌లో చోపాన్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతున్న ప్రయాణీకులను నేతాజీ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. కార్తీక పౌర్ణమి నేపథ్యంలో గంగా స్నానాలు ఆచరించడానికి వీరంతా వెళ్తున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, చూనార్ రైల్వే స్టేషన్ లోని నాలుగవ ప్లాట్ ఫారమ్ వద్ద చోపాన్-ప్రయాగ్‌రాజ్ ఎక్స్ ప్రెస్ రైలు వచ్చి ఆగింది. ప్రయాణీకులు ప్లాట్ ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. ఈ క్రమంలోనే పట్టాలపైన ఎదురుగా వస్తున్న హౌరా నుంచి కల్కా వెళ్లే నేతాజీ ఎక్స్ ప్రెస్ రైలు వారిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మర్స్ నాలెడ్జ్ సెంటర్ లో ఈ రోజు జరిగిన 7వ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కర్ణాటక గవర్నర్, న్యాయ విశ్వవిద్యాలయం కులపతి థావర్ చంద్ గెహ్లోట్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు గౌరవ డాక్టరేట్ అందచేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈ రోజు కార్తీక పౌర్ణమి. ఈ నేపథ్యంలో ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఆకాశంలో చంద్రుడు సాధారణంగా కంటే పెద్దగా ప్రకాశవంతంగా కనిపించాడు. ఈ సాయంత్రం సరిగ్గా 6 గంటల 49 నిమిషాలకు ఈ విధంగా చందమామ కనువిందు చేశాడు. దీనినే బీవర్ సూపర్ మూన్ అని పిలుస్తారు. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత సమీపంలోకి చేరడంతో ఈ అద్భుతం జరిగింది. ఈ సూపర్ మూన్ వేళ చంద్రుడు సాధారణం కంటే 13 శాతం పెద్దగా.. 30 శాతం ప్రకాశవంతంగా కనిపించాడు. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా వచ్చాడు.

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఈ నెల 7వ తేదీన దేశవ్యాప్తంగా 150 ప్రదేశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ఈ విషయాన్ని తెలిపారు. వందేమాతరం 150 ఏళ్లను పండుగగా జరుపుకోవాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని ఆయన ప్రకటించారు. ఈ నెల 26వ తేదీ వరకూ వందేమాతరం పేరుతో వివిధ కార్యక్రమాలను పార్టీ తరఫున నిర్వహిస్తామని ఆయన అన్నారు. వందేమాతరం గీతాన్ని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సమిష్టి ప్రతిఘటనకు స్ఫూర్తిదాయక చిహ్నంగా తరుణ్ చుగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గురునానక్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గురునానక్ దేవ్ ఆదర్శాలు, విలువలు మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి స్ఫూర్తినిస్తాయని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ద్వారా చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. గురునానక్ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో అనుసరించేలా వ్యవహరించాలని రాష్ట్రపతి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పుదుచ్చేరి లలో కొన్ని ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అంతర్గత ప్రాంతం, కొంకణ్, గోవా మధ్య మహారాష్ట్రలలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. నాగాలాండ్, మణిపూర్, మిజోరం త్రిపురలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త షిబిన్ బాలకృష్ణన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =